క్లుప్తంగా

మునిపల్లెలో 87 మందికి కళ్లజోళ్ల పంపిణీ



పొన్నూరు: మన్నవ పీహెచ్‌సీ పరిధిలోని మునిపల్లె గ్రామస్తులకు బుధవారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పీహెచ్‌సీ పరిధిలో 1371 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 666 మందికి కళ్లజోళ్లు ఇవ్వాల్సి ఉండగా, 87 మందికి బుధవారం అందించారు. 23 మందికి శుక్లాల ఆపరేషన్ చేయించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్. బి. వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం. వేణు, సీహెచ్‌వో వరలక్ష్మి, దీక్షిత, ఏఎస్‌ఎంలు ఎ. మాలతి, మహాలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామమోహన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆటోనగర్‌లో విద్యుత్‌కు అంతరాయం

నగరంపాలెం: ఆటోనగర్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గడ్డిపాడు ఫీడర్స్ పరిధిలోని గణేష్‌నగర్, గడ్డిపాడు, ఏఎస్ కన్వెన్షన్ ఏరియా వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని టౌన్-4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్. ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

'ఈద్గాపై ప్రతిపక్షాల విష ప్రచారం తగదు'

లక్ష్మీపురం: నగరంలో ఎంతో చారిత్రాత్మకమైన నగరంపాలెం ఈద్గాను కూలగొట్టి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తగదని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు మస్తాన్ ఖండించారు. ఈద్గా స్థలాన్ని బుధవారం కమిటీ సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. స్థలాన్ని ఎవరికీ కేటాయించలేదని, ఆక్రమణకు గురి కాకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారని ఆయన చెప్పారు.

అత్యవసర చికిత్స విభాగం వద్ద మరుగుదొడ్ల నిర్మాణం

గుంటూరు మెడికల్: అత్యవసర చికిత్స విభాగం వద్ద మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో నిర్మాణం చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అత్యవసర చికిత్స విభాగానికి సమీపంలో మార్చురి పక్కనే ఉన్న స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలసి స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. రూ. 10 లక్షలతో పురుషులకు, మహిళలకు విడివిడిగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని తెలిపారు.

జూదరుల అరెస్టు

పట్నంబజారు: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సీతమ్మ కాలనీలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 18 మందిని నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 50,150 స్వాధీనం చేసుకున్నారు.

హామీలిచ్చి ప్రజల్ని మోసగించిన చంద్రబాబు



నగరంపాలెం: పేదలకు సంక్షేమ పథకాల్ని అందించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌దేనని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. 15వ డివిజన్‌లో బుధవారం జరిగిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో 700 హామీలిచ్చి ప్రజల్ని మోసగించిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మురళి, గుదే నాగేశ్వరరావు, కరీముల్లా పాల్గొన్నారు.

సంక్షేమ పాలన రావాలంటే జగనన్నే మళ్లీ కావాలి

- ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమంలో నేతల ప్రచారం
- పలు గ్రామాల్లో పథకాల లబ్ధిదారుల పోస్టర్లు ఆవిష్కరణ

పొన్నూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు రావాలంటే మరలా జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ? కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 27, 28 వార్డుల పరిధిలోని ఎస్సీ,ఎస్టీ కాలనీ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వార్డుల్లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. మహమ్మద్, మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లారు. వివిధ సంక్షేమ పథకాలతో ప్రచురించిన కరపత్రాల్ని అందజేశారు. ప్రతి కుటుంబానికీ జగనన్న చేసిన మేలును వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని గుర్తుంచుకుని, రానున్న ఎన్నికలలో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.మస్తాన్, సయ్యద్ జానీ బాషా, పర్వీన్ బేగం, బీసీ విభాగ పట్టణ అధ్యక్షుడు కొల్లేరు శ్రీనివాస్, ఎం. అనిలా కుమారి, షేక్ షర్మిల, గౌస్, షకీల్, అజాంతుల్, పి. శ్యామ్ పాల్గొన్నారు.

పొన్నూరు రూరల్‌లో..

మామిళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే ? కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నేతలు పూలమాలతో నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం జగనన్న ప్రభుత్వంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. జగనన్న ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపారని సర్పంచ్ యానాది రావు అన్నారు. కార్యక్రమంలో పొన్నూరు మండల జేసీఎస్ కన్వీనర్ భవనం వంశీరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోహర్, బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, మైనార్టీ సెల్ నేత సర్దార్, పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ అందాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో బుధవారం గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వరకూ జొన్నలగడ్డ గ్రామానికి జగనన్న రూ. 34 కోట్లు అందజేశారని తెలిపారు. ఒక్క గ్రామానికే కోట్ల రూపాయల్ని ఐదేళ్లలో అందజేసిన జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడుస్తుందని ప్రతి ఒక్కరూ గమనించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతి హామీని ఏడాదిలోనే పూర్తి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సచివాలయం పరిధిలో నేటి వరకూ అందజేసిన సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల్ని వివరించారు. ప్రభుత్వానికి ఎన్ని మార్కులు పడతాయో తెలుసుకుని, వారి అనుమతితో స్టాంప్ వేయించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ వింతా సుబ్బారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మబ్బు సుధాకర్, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం

పెదకాకాని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను సీఎం తీసుకువచ్చారని చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంత లబ్ధి చేకూరిందో ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లు, స్థానిక నాయకులపై ఉందని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరించి, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్‌బాబు, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, స్థానిక నాయకులు ముద్రబోయిన నాగేశ్వరరావు, దంతాల వెంకటేశ్వరరావు, ఫ్రాన్సిస్, కరణం శంకరరావు, ఏడుకొండలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

చేబ్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమ పథకాలు అందుతున్నాయని చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని మంచాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. గ్రామంలోని సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ పెద మస్తాన్, గ్రామ సర్పంచ్ చందు బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పరిపాలనలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చారని వివరించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు అన్నదాసు అశోక్, ఇనకొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.



పొన్నూరు పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



మామిళ్లపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణలో నాయకులు



జొన్నలగడ్డలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న నేతలు



ఉప్పలపాడు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నేతలు



మంచాలలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

ప్రజలే జగనన్న సైన్యం

గుంటూరు రూరల్: ప్రజలే జగనన్న సైన్యమని, మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకుని ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసుకునేందుకు అంతా సిద్ధంగా ఉండాలని అర్బన్ క్లస్టర్- 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. 46వ డివిజన్ 199 వార్డు సచివాలయం పరిధిలోని పట్టాభిసీతారామయ్యనగర్‌లో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు నేటి వరకూ అందజేసిన సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాల్ని వివరించి, అభిప్రాయాల్ని సేకరించారు. కార్యక్రమంలో నగర మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు కె. పీర్‌మహమ్మద్, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ముత్యాల నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, నోడల్ ఆఫీసర్స్ నాగిరెడ్డి, గంగాధర్, రంగారెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమ' ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

పెదనందిపాడు: రాష్ట్రాన్ని సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి లక్ష్యమని పార్టీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా తెలిపారు. మండల పరిధిలోని పుసులూరులో బుధవారం రాత్రి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడానికే ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం పుసులూరు సచివాలయ పరిధిలో అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు కె. భూషయ్య, డి. నాగేశ్వరరావు, డైరెక్టర్ బొనిగల సుబ్బారావు, నల్లూరి కేశవరావు, పఠాన్ బాజీ బాషా, అల్లంశెట్టి శ్రీనివాసరావు, ఏకాంబరం సురేష్, బి. పరమేశ్వరరావు, సీతాలపు పాపారావు, కారుమూరి పుష్పరాజ్, అల్లడి వెంకటేశ్వర్లు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పుసులూరులో వలంటీర్లకు సంక్షేమ ఫలాల కిట్లను అందిస్తున్న నేతలు

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా గ్రామ ప్రారంభంలో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ విభాగం మండల కన్వీనర్ కలిశెట్టి వెంకటరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికి, గ్రామంలోకి తీసుకెళ్లారు. లక్ష్మీ నరసింహపురం కాలనీలోని శ్రీ షిర్డీ సాయినాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అంబటి రాయుడికి పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. గ్రామంలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై పెద్దలతో చర్చించారు. అభయాంజనేయస్వామి, శ్రీరామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పెద్దలతో మాట్లాడారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. క్రీడలు ఎంతో అవసరమని, విద్యార్థి దశ నుంచే వాటిల్లో ప్రావీణ్యత సాధించాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి పేదవానికి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామ కూడలిలోని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానికంగా ఉన్న చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, సచివాలయం కన్వీనర్ రేటూరి శివబ్రహ్మం, నేతలు అద్దంకి దర్మారావు, దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, మువ్వ బుజ్జమ్మ, జయరాజు, బాజీ, యర్రంశెట్టి బాబూరావు, యర్రంశెట్టి పెద్దబ్బాయి, దుర్గ, శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




పొదుపు సంఘాల మహిళల సమావేశంలో మాట్లాడుతున్న క్రికెటర్ అంబటి

నిధుల దుర్వినియోగంపై డీఎల్పీవో విచారణకు బ్రేక్

- వెనిగండ్ల పంచాయతీ కార్యాలయంలో ఇరువర్గాల ఘర్షణ
- విచారణ అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయిన డీఎల్పీవో

పెదకాకాని: నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేయడంపై విచారణ చేసేందుకు బుధవారం డీఎల్‌పీవో లక్ష్మణరావు వెనిగండ్ల పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ముందస్తుగా సమాచారం అందుకున్న రెండు వర్గాలు కార్యాలయానికి చేరుకుని డీఎల్‌పీవో ఎదుటే వాగ్వివాదానికి దిగాయి. ఆయన సర్ది చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. దీంతో విచారణను అర్ధంతరంగా ముగించేసుకొని అక్కడి నుంచి గుంటూరు వెళ్లిపోయారు. వెనిగండ్ల పంచాయతీలో అనేక అక్రమాలు జరిగినట్లు అదే గ్రామానికి చెందిన అంబేడ్కర్ అధ్యయన కేంద్రం తరఫున వల్లభాపురపు ప్రేమ్ సాగర్ ఫిర్యాదు చేశారు. సర్పంచి వేల్పుల శ్రావణి పంచాయతీకి సంబంధించిన రూ. 40 లక్షలను నిబంధనలు విరుద్ధంగా డ్రా చేశారని ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా గ్రామంలో జంగిల్ క్లియరెన్స్, పారిశుద్ధ్య మెరుగుదల, మరమ్మతులు, వివిధ రకాల వస్తువుల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్ది రోజుల కిందట నేరుగా జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు అందజేశారు. దీనిపై విచారణకు వెళ్లిన డీఎల్‌పీవో ఎదుటనే ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొందరి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ పూర్తి చేసి త్వరలో డీపీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.



వెనిగండ్ల పంచాయతీలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

స్పిన్నింగ్ మిల్లులో కార్మిక శాఖ అధికారుల తనిఖీ

16 మంది బాలకార్మికుల గుర్తింపు

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం రోడ్డులోని ఓ స్పిన్నింగ్ మిల్లులో బుధవారం బాలకార్మిక నియంత్రణ శాఖ అధికారులు దాడి చేశారు. మిల్లులో 16 మంది బాల కార్మికులను గుర్తించారు. నిబంధనల మేరకు లోబడి కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. బాలకార్మికులను గుంటూరు చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ శాఖ అధికారులకు అప్పగించారు. ఒడిశా నుంచి కొన్ని కుటుంబాలు తక్కువ కూలితో మధ్యవర్తుల ద్వారా బాలకార్మికులను ఇక్కడకు తీసుకొస్తున్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. తనిఖీల్లో యాంటి ఉమెన్ ట్రాఫిక్ ప్రొటక్షన్ ఏఎస్‌ఐలు బేబీ రాణి, లక్ష్మి, పీసీలు బేబమ్మ, గాయత్రి, లేబర్ ఇన్‌స్పెక్టర్ దేవసేన, ఏఎల్వో రెడ్డి, చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ చైర్మన్ స్వర్ణలత, సరిత, జిల్లా లీగల్ సొసైటీ ప్యానల్ మెంబర్ కాళిదాసు పాల్గొన్నారు.

కుల గణన సమర్థంగా నిర్వహించాలి

మంగళగిరి: కుల గణన సమర్థంగా నిర్వహించాలని డీఎల్‌డీవో పద్మావతి కోరారు. స్థానిక రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో కులగణనపై అధికారులకు, సిబ్బందికి శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుల గణనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయి పర్యటించి వివరాలను తప్పకుండా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన లెక్కింపు ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గణన నిర్వహించే సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి వివరాలతో పారదర్శకంగా జాబితాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, టౌన్ ప్లానింగ్ సీపీఓ కె.అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడికొండ: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడికొండలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడికొండ గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఖలీల్(27) ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు బంధువులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జి.శ్రీనివాసరావు చెప్పారు.